# భేతాళుడు చెప్పిన కథ



కంబనపల్లి వెంకటకిషన్‌రావు

ఎనిమిదింటిదాకా ఎలాగూ బస్సురాదని తెలుసుకుని రోడ్డుకు అర ఫర్లాంగుదూరంలో వున్న ఓ బండమీదికి వెళ్లాం మేమంతాను. మేమంతా అంటే నేనూ నరసింహం, వాడి స్నేహితులు శేషగిరీ, శంకరయ్యా అన్నమాట. అప్పుడే సైకిలుమీద వెళ్లిన ఓ బడిపిల్లాడు చెప్పిన శుభవార్త ప్రకారం, ఐదు గంటలకు రావలసిన బస్సు ఆపసోపాలుపడి దారిలో ఆగిపోయినట్టు తెలిసింది, మరో బస్సు రావాలంటే ఎనిమిదింటిదాకా వేచివుండక తప్పదు - యింకా రెండు గంటలు...

నేను, యీ వూళ్లో పంతులుగిరీ చేస్తున్న తమ్ముడు నరసింహాన్ని చూసిపోదామని వచ్చిన బాపతు. వీడ్కోలివ్వడానికి వచ్చిన తమ్ముడితోపాటూ—వాడి మిత్రులిద్దరూ, నిరాశను ఆశగా ముఖంనిండా పులుముకున్నారు. అది చూసిన నాకు జాలి కలిగింది.

'ఏమయినా కబుర్లు చెప్పండిసార్'— శేషగిరి అన్నాడు.

'అవును సార్. ఎలాగూ ఎనిమిదింటిదాకా కాలక్షేపం చేయాలికదా—' అని వత్తాసు పలికాడు శంకరయ్య.

అక్కడున్న ఒక్క రోజులోనే వాళ్లిద్దరూ నాకు చనువయ్యారు. ఒకరు చిల్లర దుకాణమూ, మరొకరు గ్రామ వైద్యశాలనీ నిర్వహిస్తున్నారు.

'ఏం కబుర్లు చెప్పమంటారు, నాపుద్యోగపు కబుర్లు చెప్పనా?'

'అవెందుకు సార్. వృత్తియింజనీరింగ్— బోరింగ్‌గా వుంటాయి'—శేషగిరి వువాచ.

ఇంతలోనే శంకరయ్య అందుకున్నాడు :

'మీరు మధ్య మధ్య కథలుకూడా రాస్తారని నరసింహంగారనేవారు. ఓ మాంచి కథ చెప్పరాదటూ'

'ఏకథ కావాలి ? సాంఘికమా, జానపదమా, చారిత్రకమా, పౌరాణికమా'— అన్నాను చిలిపిగా.

'అన్నీ కలిపి తెలుదుమా — తెలుగు సినిమాల్లాగా' అన్నారు ఒక్కటిగా.

'ఏదైనా — మంచి ఇంట్రెస్టింగ్‌గా వుండే కథ చెప్పన్నయ్యా'—తమ్ముడుకూడా వుమ్మడిలో చేరాడు.

'సరే—భేతాళ కథలు విన్నారు కదూ'

'విన్నాం. విక్రమార్కుడికి వాడెన్నో చక్కని కథలు చెప్పాడు కదండీ.' అందరి తరపునా శంకరయ్యే అన్నాడు.

'అయితే యిది భేతాళుడు చెప్పినకథ

శ్రద్ధగా వినండి' అనగానే ముగ్గురూ సిద్ధమే అన్నట్టు కూర్చున్నారు. పిండార బోసినట్టున్న వెన్నెలకూడా నన్ను ప్రోత్సహించింది.

* * *

అప్పన్నశాస్త్రులు ఆ వూరికి మునసబు గారు. అప్పటికి తల్లిదండ్రులు కాలం చేసినా తండ్రి మిగిల్చిన ఆస్తిని మాత్రం కాలం చేయనీకుండా మరింత పెంపుచేసాడు. అన్నదమ్ముల జంజాటం లేకపోవడంవల్ల అతనిది ఏకచ్ఛత్రాధిపత్యమయిందా వూళ్ళో. పేరుచెబితే మారు మాట్లాడేవాళ్ళు లేరు.

ఆయన భార్య లక్ష్మీదేవమ్మగారికి గర్భాలన్నీ పదినెలలు నిండకముందే పలాయనం చిత్తగించేవి. ఓ నాలుగుసార్లతో అవీ సరిపెట్టుకున్నాయి. అప్పట్నుంచీ అప్పన్న శాస్త్రిగారికి వొకే చింత పట్టుకుంది, యీ ఆస్తిపాస్తులన్నింటినీ ఎవరి నెత్తిన పెట్టాలా అని. అదే విషయం సతీమణితో అన్నప్పుడల్లా ఎవర్నయినా దత్తత చేసుకుందామని ప్రక్కన కూచుని వీపు నిమురుతూ చెప్పేది.

రోజులు గడుస్తున్నకొద్దీ అప్పన్న శాస్త్రులుగారికి మరింత చింత కలిగసాగింది. వూళ్ళోవున్న నలుగురు పెద్దలూ—'ఏమంత వయసు పోయింది గనుక, ముద్దుగా మరో పుత్తడి బొమ్మ పూర్ణమ్మను కట్టుకోరాదుటండీ' అన్నారు.

ఆ మాటలు వాళ్ళన్నంత పనీ చేయక పోయినా ఎలాగయినా పుత్రసంతానం పొందాలనే కోరిక అతనిలో మరింత — అధికం కాసాగింది. సరిగ్గా అలాంటి సమయంలోనే ఆయనకు, స్నేహితుని పెళ్ళికై బెజవాడ ప్రయాణం పడింది. పెళ్ళిసంబంధం ముగిశాక తిరా రేపు స్వగ్రామం బయలుదేరదామనుకుంటుండగానే ఆ రాత్రి వో నాటకం చూసే అవకాశం కలిగింది. ఆ నాటకమేలా వున్నా కథానాయికి చెలికత్తె మటుకు అప్పన్న శాస్త్రులు కళ్ళకు దేవతలా కనిపించింది. ఆ రాత్రంతా కళ్ళుతెరిచినా, మూసినా— కథానాయిక చెలికత్తె కళ్ళముందుండేది. కంటికి నిద్రరాకపోయింది. స్నేహితుడు ఆప్యాయంగా అమరింపజేసిన పట్టుపరుపు కూడా అంపశయ్యయింది. ఆమె ప్రక్కన విదూషకునిలా తనను తాను పోల్చుకుని సంతృప్తి చెందేవాడు. కానీ ఆ పోలిక మరుక్షణంలో కరిగిపోయేది. అయినా, పోలికకేం ఖర్మ, జమీందారీ అంత ఆస్తిపాస్తులుండగా, అనిపించింది.

మనిషి మనసుపడాలేగానీ ఆ వస్తువు మీద ఆశవదులుకోవడం అంత సులువుకాదు, అందునా సహజమైన కోరికగల శాస్త్రులు గారికి.

తెల్లవారీ తెల్లవారకమునుపే, ఆ నాటకాల కంపెనీ వాళ్ళతో మాట్లాడడమేమిటి, ఆ అమ్మాయిని పెళ్ళికి వొప్పించడమేమిటి, గుళ్ళో పెళ్ళిచేసుకోవడ మేమిటీ, స్వగ్రామం ప్రయాణం కావడమేమిటీ అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి.

ఆ పిల్లపేరు సీత.

దారిలోకూడా, రాత్రి నాటకంలో అభినయించిన సిగ్గును ప్రదర్శిస్తుంటే అప్పన్న శాస్త్రులే ఆమెను వో దారికి తెచ్చాడు. దానా దీనా వివరాలన్నీ తెలుసుకున్నాడు ఆమెనుండే...

ఆమెది వో బీద బ్రాహ్మణ కుటుంబమనీ, సంగీతం నేర్పుతూ కడుపు నింపుకునే తండ్రి కాస్తా గుటుక్కుమనడంతో వాళ్ల కుటుంబం వీధిని పడిందనీ, తండ్రిగారి శిష్యవరేణ్యుడి యీ నాటకాల కంపెనీలో సీతకు ప్రవేశం దొరికిందనీ, నాటకాల్లో చేరిన రెండుమూడు నెలల్లోనే కన్నతల్లి కన్నుమూసిందనీ తెలిసింది. కంపెనీ వాళ్లు చెప్పిన వివరాలకూ, యీ వివరాలకూ బేరీజు వేసుకుని సామ్యం చూసి తృప్తి పడ్డాడు శాస్త్రులు.

స్వగ్రామం చేరుకున్న తరువాత ఒక్క లక్ష్మీదేవమ్మ తప్ప. వూరు వూరంతా ఉత్సవం చేసుకున్నంత పని చేసింది. లక్ష్మీదేవి కూడా లోలోన సంతోషించక పోలేదు; వొక్క సవతి అనే భావం కలగడం తప్ప. తనకెలాగూ సంతులేకనే పోయె. ఆమెకన్నా పడినిండితే అంతకన్నా కావలసిందేముంది అనుకుంది, అంతకంటే యేమీ చాతకాక.

అప్పన్నశాస్త్రులు చేసినపనే వో పేదింటివాడుచేస్తే వూరు వూరంతా వచ్చినదాన్ని, తెచ్చుకున్న వాణ్ని తన్ని వూరిబయటి శ్మశానంలో తగిలేసేది. కులంనుంచి వాణ్ని వెలివేసి వూళ్ళో వుప్పుగల్లుకూడా పుట్టనీయక పోయేది. నీతి, ధర్మం, వేదం, పురాణం వల్లించేవి. ఏదో బాగోతపు ముండను తెచ్చుకున్నావ్, నీ బాగోతం చెల్లదనేది...కానీ, అపని చేసింది — వూరికే పెద్ద దిక్కయిన అప్పన్నశాస్త్రులు ... అందునా ఆతను దేవుని యెదుట ప్రమాణం చేసి నిజంచెప్పి పరిణయమాడాడు. కానీ ఆ మాటే మరో వుండాకోరంటే నమ్మేదికాదీ లోకం.

జరిగించెలాగో జరిగిపోయింది. సవతులిద్దరికీ దేవిడీని రెండు భాగాలుచేసి పంచి యిచ్చాడు. వెనకటికి ద్రవుపది ఐదుగురి దగ్గర సంసారం చేసినట్టే — అప్పన్న శాస్త్రులుకూడా యిద్దరి భార్యలదగ్గరా చెరోనెలా వుంటూ ఎవర్నీ నొప్పించక, తానొవ్వక ధన్యుడై తిరిగేవాడు. వచ్చే ఆదాయాన్ని చెరింతా పర్చేవాడు.

కాలమొక్కరీతి నడవదుగదా ... కొన్నాళ్లకు సీత కడుపు పండింది. పండంటి కొడుకును కన్నది. అప్పన్న శాస్త్రులు పుత్రోత్సాహంతో అడపాదడపా, లక్ష్మీదేవిని నిర్లక్ష్యం చేసేవాడు. లక్ష్మీదేవి కిదంతా ఏవిటో అనిపించింది. వాళ్ళిద్దరూ కలసి తననే తుప్పలో, తంగేళ్ళో పట్టించరు కదా అనుకొనేది.

వాళ్ళింత తీవ్రంగా ఆలోచించక పోయినా, లక్ష్మీదేవి మనసుమాత్రం ఆమె కేదో తీరని అన్యాయం జరిగితీరుతుందని ఘంటా బజాయించి చెప్పేది. అప్పట్నుంచీ శాస్త్రులు తనవద్ద వున్నప్పుడల్లా విభాగాలు చేయుమని పోరుతుండేది. ఇలా జరుగుతుందని ఏనాడూ అనుకోలేదు. వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళలా కలసిమెలసి వుంటారనుకున్నాడు. ఎవరి కొడుకైతేనేం — మనసంతుకదా అనుకుంటారనుకున్నాడు. ఆస్తిపాస్తులన్నింటికీ వో వారసుడు పుట్టాడుకదా అని కొండెక్కినంత సంతోషపడ్డాడు.

వీళ్లిద్దరిమధ్యన పాపం శాస్త్రులు వూపిరి పీల్చలేకపోయేవాడు. ఇక తనకు ఆపైన భగవంతుడూ, క్రిందపుట్టిన కుమారశేఖరుడే దిక్కనుకునేవాడు. రానురాను లక్ష్మీదేవి ప్రవర్తన మరీ రాక్షసత్వంగా కనిపించసాగింది. అందుకే ఎప్పుడో వోసారి చుట్టపు చూపుగా మాత్రం వెళ్లి పరామర్శించి వచ్చేవాడు ... అస్తమానమ్మా కొడుకు వద్దే వుండేవాడు.

ఇంత జరుగుతున్నా వూరేం పట్టించుకోలేదీ విషయాలను. చిన్నతనంలో యిల్లు వదిలిపోయి, మిలటరీలోచేరిన తమ్ముణ్ణి [illegible]

# భేతాళుడు చెప్పని కథ

పించుకుంటది; వాడు వెదిరిస్తే నన్నా మొగాడు వింటాడేమోనని.

కానీ లక్ష్మీదేవి అనుకున్నట్టు జరుగ లేదు. ఇన్నాళ్ళూ వొకరికి చెప్పిన మనసే కనుక, మరొకరితో చెప్పించుకునే స్థితిలో లేదు శాస్త్రులు మనసు. అందునా యిన్నాళ్ళు తనతో సంసారంచేసి, ఏదయినా విషయముంటే తన నడగక తట్టాబుట్ట లేని తమ్ముణ్ణి పిలిపించి తనకు బుద్ధి చెప్పించ జూసిందే అని వొకటే బెంగపడే వాడు. లక్ష్మీదేవి తమ్ముడు సెలవు అయి పోవడంతో అక్క ఎదటో సావధాన్‌కొట్టి, సలాంపెట్టి వెళ్ళిపోయాడు. తమ్ముడిరాక ముందుకంటే వ్యవహారం ముదిరిందే అని కుమిలింది లక్ష్మీదేవి.

ఇన్నాళ్ళనుంచీ చప్పుడయినా చేయని సీత కూడా యీ పరిస్థితినిచూసి, విభాగాలు చేస్తేనే మంచిదని చెప్పింది.

తాతముత్తాతల కాలంనుంచి విభాగాల పేరు వినని శాస్త్రులుగారికి యిద్దరు పెళ్ళాలూ, యిప్పుడు చెవుల్లో యిల్లుకట్టుకొని విభాగాలో అంటూ—వేదాలు వల్లించడం కర్ణకఠోరనుయింది. అతనికి అన్నపానాదులుకూడా సహించకుండా అయ్యాయి.

అహోరాత్రులూ, యీ సమస్యా పరిష్కారమెలాగ అని ఆలోచించి అనారోగ్యం పాలయ్యాడు శాస్త్రులుగారు. బలహీనత ఎక్కువయింది. గుండె జబ్బుతో మంచం పట్టాడు. కొడుకు మంచం పక్కనే తన మంచం వేయించుకుని, చివరి రోజులు వెళ్ళదీస్తున్నావనేవాడు.

సీత గుళ్ళో పెళ్ళి చేసుకున్నా శాస్త్రులునే తనపాలిట దేవునిగా భావించింది. తనను కష్టాల్లో ఆదుకున్న శాస్త్రులుగారికిలా జబ్బురావడం సీత నెంతో కలవరపరిచింది...ఎక్కడెక్కడి వైద్యులనో పిలిపించి, తనమీది నగలన్నీ వలిచి వైద్యం చేయించింది. కానీ లాభంలేకపోయింది. దినదినానికీ రోగం ముదరడమేగానీ తగ్గలేదు...

వూళ్ళోకూడా ఆ సమయానికి పరిస్థితులు తారుమారయ్యాయి. ఎన్నికల మూలంగా వూళ్ళో ఒకరిమీద మరొకరికి కక్షలూ కావేషాలూ పెరిగిపోయాయి. కొంతమందికి శాస్త్రులుగారంటే అరికాలిమంట నెత్తికెక్కినట్టుండేది. శాస్త్రులుగారి గ్రూపుకు పలుకుబడి ఎక్కువ వుండడంవల్ల మిగతా వాళ్ళకు కళ్ళమంటగా వుండేది.

సీత అహోరాత్రులు శాస్త్రులుగారికి సేవ చేయడంలో మునిగిపోయేది; భర్త కింత యిదిగావున్నా లక్ష్మీదేవిమాత్రం వొక్కసారి కూడా అతన్ని పరామర్శించడానికి వెళ్ళేది కాదు. అంతిమ ఘడియల్లోవున్న శాస్త్రులుగారికి యిదీ మరీ విచారం కలిగించేది.


ఇన్నాళ్ళనుంచీ బయటికయినా వెళ్ళని లక్ష్మీదేవి వూళ్ళో భర్తకు ప్రతికూలంగా వుండేజట్టు వాళ్ళని కూడదీసుకుని ఆమెకు అనుకూలంగా మార్చుకుంది. ఒకసారి, నలుగురి పెద్దలను తీసుకుని చావు బ్రతుకుల్లోవున్న శాస్త్రులుగారి దగ్గరికి విభాగాల విషయం అంతుతేలుద్దామని వెళ్ళింది. శాస్త్రులుగారు కసురుకోవడంతో ముఖాలింత చేసుకుని బయటపడ్డారు. లక్ష్మీదేవి గురించి ఆ నోటా అనోటా శాస్త్రులుగారు వినకూడని మాటలుకూడా వినవచ్చేవి.

ఎన్నాళ్ళని ఆ జబ్బుమనిషికు శాస్త్రుల్ని అంటిపెట్టుకుని వుంటుంది. అంతుమాసి మరీ వెళ్ళిపోయింది. ఇద్దరు పెళ్ళాలమధ్య ముక్కచెక్కలా నలిగిన శాస్త్రులుగారి శరీరంలో గాలి బుస్సుమంది, చివరి కెలాగైతేనేం సీతసేవలే అతనికి యిష్టమయ్యాయి.

నాలుగియిదేళ్ళ కొడుకుని ముందరేసుకుని భర్తమీద పడిఏడుస్తున్న — సీతను ఘూరడించే నెపంతో లక్ష్మీదేవి వచ్చింది; ఆమెకనుకూలంగావున్న నలుగురు పెద్దల్నీ తీసుకునివచ్చి శవాన్ని తన వాటాలోకి తీసుకుపోయింది. అక్కడున్న నలుగురూ పెద్దలముందు మూతులు ముడుచుకుని ఆ తరువాత యిదే న్యాయం అని బుగ్గలు నొక్కుకున్నారు. అప్పటికప్పుడు పూరి వాతావరణం మారిపోయింది. శాస్త్రులుగారి మరణంతో ప్రతిపక్షం వారిదే మెజారిటీ అయిపోయింది.

టంటివార్త పంపి, తమ్ముణ్ణి పిలిపించి అతనితో దహన సంస్కారాలు జరిపించింది లక్ష్మీదేవి. చివరి రోజులకూడా మనసుదీరా, మగనిమీద పడి ఏడవడానికికూడా నోచుకోలేక పోయింది సీత. మాలిమయిన కొడుక్కు, అతను లేకపోవడంతో, బెంగ పెట్టుకుని తీవ్రమయిన జ్వరం పాలయ్యాడు...

ఒకరితో అడిగేస్తే అసలు విషయం బయటపడింది. 'సీత నాటకాల నుంచి వచ్చింది కనుక ఏ భోగంపిల్లో అయుం



...ఆ పిల్లను పెండ్లి చేసుకొన్నందుకు...యింటి గుమ్మం త్రొక్కవద్దాన్నావుగా...అందుకని జాగ్రత్తగా కిటికీన్ని దాటుకొని...వస్తున్నా...నాన్నా...

టుంది. దాని ముఖానసేతు బ్రాహ్మణ రూపుండేకదూ' అందిట లక్ష్మీదేవి. భర్త రోగాన పడివున్నప్పుడు లేని ప్రేమ, ఆయన ప్రాణంపోయిన తర్వాత కాని బయటికి రాలేదు ఆమెకు.

ఈ మాటలువిన్న విన్న సీత నిశ్చేష్టిత అయింది. అవును, యిన్నాళ్ళనుంచి శాస్త్రులు గారితో సంసారం చేయడానికీ, సంతు పొందటానికీ, ఆయనకు చివరి రోజుల్లో సేవచేయడానికీ, అవసరం కలగని కులమూ, గోత్రమూ, యీనాడు ఆస్తి పోతుందనే భయంవల్ల అవసరం కలిగాయి. అదే సూత్రంమీద చివరకు కట్టుబట్టలతో, కన్న కొడుకుతో గడప దాటించారు సీతను.

పాపం. ఎక్కడికి వెళ్ళగలదామె. నాటకం కంపెనీలో దివాలాతీసిన తండ్రిగారి శిష్యుని దగ్గరికి వెళ్ళగలదా. సాక్ష్యానికి, పేరైనా తెలియని గుళ్లో పూజారిదగ్గరి కెళ్లగలదా? కళ్ళుమూసుకునీ, సత్యం తెలిసీ, అసత్యానికీ, అధర్మానికీ చేయూత నిస్తున్న దేవుని దగ్గర కెళ్లగలదా...

ఎక్కడికీ వెళ్ళలేదు. భోరున యేడుస్తూ వూరి పొలిమేర దాటేంతలో జోరున వర్షం మొదలయింది. సీత కష్టాలకు జలదేవత అనుగ్రహించి ఆశీస్సులు కురిపించింది.

పొలిమేరలోవున్న దయ్యాల మర్రిక్రింద కూచుని. పేరేగిపోతున్న కొడుకు జ్వరాన్ని తగ్గించమని దేవుణ్ణి ప్రార్థించింది సీత. కానీ, తండ్రిలేని తనయుణ్ణి బ్రతికించడం యిష్టంలేక దేవుడా చిన్ని ప్రాణాన్ని కూడా తనలో లీనం చేసుకున్నాడు.

శ్వాస ఆడని చంటివాణ్ణి చూసిన సీత—

భర్తపోయినా చివరి ఆశతో జీవించా లనుకొన్న సీత—

వాణ్ణి పెద్దజేసి సంఘంమీద కసి దీర్చుకోవాలనుకున్న సీత—ఎక్కడో పిడుగు పడ్డ శబ్దం విని గావుకేక వేసింది. అంతే నోరు పోయింది. ఆమె గొంతు పూడి పోయింది. ఎంత ప్రయత్నించినా శబ్దం రాలేదు. సంఘం చేసిన అన్యాయాన్ని నలుగురికీ చెప్పకోవడానిక్కూడా, అవకాశం లేకుండా దేవుడామెను మూగదాన్ని చేసాడు. అనంతమైన చీకట్లో— గమ్యంలేని పథకు రాలిలా నడిచిపోయింది సీత.

* * *

'కథ విన్నారుకదూ — పెళ్లాడిన దగ్గ ర్నుంచీ పతిని దైవం కన్నా యెక్కువగా భావించే సీతకు అన్ని కష్టాలు ఎందుకు కలగాలి? అలాంటి పరిస్థితి రావడానికి కారణం ఎవరు? భర్త అప్పన్నశాస్త్రులా, సవతి లక్ష్మీదేవా, లేక తను నాటకాల కంపెనీనుంచి రావడమా — ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసికూడా చెప్పలేక పోయారో...'

'ఆగండిసార్ — మీరు శపించబోకండి గానీ, మాకు నిజంగా సమాధానం తెలి యదు—' అన్నాడు శంకరయ్య.

మిగతా యిద్దరి వంకా చూశాను. వాళ్ళూ డిటో ఫేస్ చూపించారు.


మొదటిసారిగా సాహిత్యాభిమానులచే ఎన్నో ఆకర్షణలతో నడుపబడుచున్న నిజాయితీగల సాహిత్య పోటీ—1

ఎక్కువ ఎంట్రీలు పంపినవారికి వరుసగా రు. 500, రు. 300 రు. 200 కన్సొలేషన్ ప్రయిజులు యివ్వబడును.

ఆల్ కరెక్టు : రు. 20,000 కాంపిటేటర్స్ ఛాయిస్

ఆల్ కరెక్టు రు. 5,000 1, 2 తప్పులకు రు. 4.000

# రు. 30,000 గెలవండి!

## రాధీ లిటరరీ సిండికేట్ (రిజిష్టర్డు)

## వీరంకిలాకు - కృష్ణా జిల్లా (A. P.)

(సుప్రీం కోర్టు తీర్పు ననుసరించి నడుపబడుతున్న సాహిత్య పోటీ)

ముగింపు తేదీ :

**3-5-71**

కినొల్యూషన్ :

**8-5-71**

ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్ర భూమి పత్రికలలో ప్రకటించబడును.

**ప్రవేశరుసుము :** 1 ఎంట్రీకి రు. 1—00, 6 ఎంట్రీలకు రు 5—00, 4 ఎంట్రీలు పంపినవారికి ఒక కాంపిటేటర్స్ ఛాయిస్ ఉచితము. కాంపిటేటర్స్ ఛాయిస్—మొత్తము 6 క్లూలు 1. 2, 3 క్లూలు మరియు మిగిలిన మూడు క్లూలు. 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12 క్లూలునుండి మీ యిష్టం వచ్చినవానిని ఎన్నుకొనవచ్చును. రు. 10 లకు 12 ఎంట్రీలు, 3 కాంపిటేటర్స్ ఛాయిస్‌లు పంపవచ్చును.

**ఆధారములు :** 1 బ్రాహ్మణులందరూ [నారాయణ/బ్రహ్మ] స్వరూపులు కాదా! 2 స్త్రీకి [నగలు/భర్త] ప్రాణం 3 మహాకావ్యసృష్టికి ముఖ్యముందు ఉదాత్త [భావనా/సృజనా] శక్తి కావలయును. 4 మహాభారతములో నిరూపించు [ధర్మ/అహింసా] స్వరూపము విశిష్టమైనది. అది వేద ధర్మమునే అనుసరించును. 5 [ధర్మం/న్యాయం] జాతినిబట్టే. దేశాన్నిబట్టీ మారుతుంది. 6 మనంచేసే పనులన్నింటికీ ఆత్మసాక్షి, అంతఃశుద్ధి అంటే ఏంచేసినా [భయంలేదు/పాపంకాదు] 7. [సంసారం/తాళి] కన్నా ఆడదానికి విలువైంది లేదంటారు. 8 స్త్రీ పురుషుల దైహిక సంబంధం కామం [సామాజిక/మానసిక] సంబంధం ప్రేమ. 9 [సుఖ, దుఃఖా/ఒడిదుడుకు] లనేవి ప్రతిమనిషి జీవితంలోను వస్తూవుంటాయి. 10 కొందరు [ప్రపంచాన్ని/గొప్పవారిని] చూచి నిష్కారణంగా ద్వేషిస్తూ బాధపడేవాళ్ళుంటారు. 11 మానవుడన [ప్రాణము/జీవము] మనస్సు మాత్రమే. 12 అధికారంలో అహోరకమైన [ఉన్మత్తత/ఆనందం] ఉంది.

**నిబంధనలు :** (1) ఇండియాలో ఏ ప్రాంతమందున్నవారయినను ఇందులో పాల్గొని గెలుపొందవచ్చును. తెల్ల కాగితముమీద మీరు కరక్టు అనుకున్న పదములు వరుసగా వ్రాసి M.O. రశీదుకాని, క్రాసుచేయని I.P.O.గాని జతపర్చి పంపవలెను. (2) ఒకరే ఎన్ని కూపనులయినా పంపి ఎన్ని బహుమతులయినా గెల్వవచ్చును. ఒకరికన్న ఎక్కువమంది విజేతలున్నచో బహుమతుల సొమ్ము సమముగా పంచబడును. (3) ఆల్ కరక్టు ఎవరూ లేనిచో ఒక తప్పుగల వారికి ఆ బహుమతి పంచబడును. అట్లే మిగిలిన బహుమతులు. (4) రచయిత(త్రి) తన పుస్తకమందు వాడిన పదమే సరియైనది. రచనలు పేజీ నెంబర్లతో సహా ప్రకటించబడును. (5) ఆక్షేపణలున్నచో విజేతల లిస్టు ప్రకటించబడిన 10 రోజులలో పది రూ. M.O. చేస్తూ ట్రస్టుకటీకి మాకు తెలియజేయవలెను. (6) మేనేజిమెంటువారిదే తుది నిర్ణయము. లావాదేవీలన్నీ గన్నవరం కోర్టులోనే పరిష్కరించుకోవాలి. (7) ముగింపు తేదీనాడుకూడ మీ ఎంట్రీలు ఎక్స్‌ప్రెస్ డెలివరీలో పంపవచ్చును. కాని అవి మాకు 6—5—71 లోగా చేరాలి. విజేతల లిస్టు, తరువాత పదావళి కొరకు 30 పై. పోస్టలు స్టాంపులు జతపర్చవలెను. (8) మీ ఎంట్రీలు మొదలైనవన్నీ—

"రాధీ లిటరరీ సిండికేట్ (రిజిష్టర్డ్) వీరంకి లాకు కృష్ణా జిల్లా (A.P.) కి" మాత్రమే పంపవలెను.




# భేతాళుడు చెప్పని కథ

'అయితే వినండి. సీతకన్ని కష్టాలు రావడానికి కారణాలు పైన చెప్పినవేవీ కావు. మనం...అంటే మనమంతా కలసిన ఈ సంఘం ... అర్థం, పర్థంలేని కుల, మత, వర్గ విపక్షతలో అన్యాయాలనూ, అక్రమాలనూ కళ్ళుమూసుకుని చేస్తున్నది మనం. ఆనాటి నలుగురు పెద్దల్లో ఏ వొక్కరికైనా వివేకమనేది వుంటే అలా జరిగేది కాదు. సీత బ్రాహ్మణ కుటుంబానికి చెందింది కావచ్చు -- కాకపోవచ్చు. అన్నాళ్ళు శాస్త్రులుగారితో సంసారం చేసినా, సంతుపొందినా పూకొట్టిన సమాజం, పుచ్చిపోయిన సమాజం, అతను గుటుక్కుమనగానే ఎందుకు హుంకరించింది? అతనున్నప్పుడు బయపడి — అంతేకదూ — ఈ సమాజంలో, కోరలు కనిపించని, గోముఖ వ్యాఘ్రాలున్న ఈ సమసమాజంలో జీవించాలంటే, అదీ, మనిషిగా జీవించాలంటే కండన్నా వుండాలి, కాసన్నా వుండాలి. ఈ రెండింటి అండలేని వాడు కాకులకు గూడా గొరగాడు. ఇదీ మన సమాజపు స్థితి. ఇలాంటి గౌరవ సమాజంలో మనం సభ్యులం' అన్నాను ఆవేశంతో.

'ఏమిటోనండీ, మీరు చెప్పేదేమీ తలకెక్కడం లేదు' అన్నాడు శంకరయ్య మిగతా యిద్దరూ డిటో ఫేసు చూపించారు.

దూరంనుంచి వస్తున్న బస్సులైటు వెలుగు మామీద పడడంతో నలుగురం ఒకే సారి లేచి బస్సువైపు పరిగెత్తాం. ●

[అంకితం : వర్ణ వ్యవస్థ జీవించడం కన్నా తాను మరణించడం మేలన్న మహాత్ముని మహనీయ స్మృతికే.

—రచయిత.]